నిధులొచ్చినా ఫలితం శూన్యం

- లింక్ రోడ్ల రెన్యూవల్ బీటీకి నిధులు మంజూరైనా పనుల్లేవ్
- టెండర్లు పిలిచినా ఆసక్తి చూపని కాంట్రాక్టర్లు
- నిధులు విడుదల గాక నిలిచిన కొండాపురం రహదారి పనులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు


అధ్వానంగా సీతారాంపురం - నారాయణపురం రోడ్డు

చిలుకూరు : మండలంలో పలు గ్రామాలను కలిపే లింక్ రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆయా రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అధికారులు టెండర్లు కూడా పిలిచారు. కానీ సకాలంలో ప్రభుత్వం నుంచి బిల్లులు వస్తాయో రావోనన్న సందేహంతో కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. దీంతో శిథిలమైన రోడ్లపై ప్రజలకు తిప్పలు తప్పడం లేదు.

ముందుకు రాని కాంట్రాక్టర్లు..

ప్రధానంగా మండలంలో రెండు రోడ్లకు రెన్యూవల్ బీటీ వేసేందుకు నిధులు మంజూరయ్యాయి. కోదాడ- హుజూర్‌నగర్ రోడ్డులో సీతారాంపురం నుంచి నారాయణపురం వరకు 2.4 కిలోమీటర్ల వరకు బీటీ రోడ్డుకు రెన్యువల్ బీటీ (బ్లాక్ తార్) వేసేందుకు ఎమ్మెల్యే కృషితో ఏడాది క్రితం రూ. 43 లక్షలు మంజురయ్యాయి. కానీ టెండర్లు పిలిస్తే కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. దీంతో ఆ పనులు నేటికీ ప్రారంభం కాలేదు. అలాగే మునగాల మండలం నరసింహాపురం నుంచి ఆర్లెగూడెం వరకు బీటీ రోడ్డు అధ్వానంగా మారింది. దీంతో ఈ రోడ్డుకు రెన్యూవల్ బీటీ వేసేందుకు 1.6 కిలో మీటర్లకు రూ.32 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. కానీ పనుల ఊసే లేదు.

ఎనిమిది నెలలుగా..

కాగా, మండలంలోని కొండాపురం క్రాస్ రోడ్డు నుంచి కొండాపురం, మాధవగూడెం గ్రామాల మీదుగా మునగాల మండలం ముకుందాపురం వరకు సుమారుగా 8 కిలోమీటర్ల మేర రోడ్డుకు ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన నిధులు రూ.3.50 కోట్ల నిధులు మంజురయ్యాయి. అయితే ఈ రోడ్డు పనులు ప్రారంభంలో చకచకా సాగాయి. ఆ సమయంలో రోడ్డులో మెటల్ లేని చోట మెటల్ వేస్తూ పనులు చేశారు. కల్వర్టులు కూడా పూర్తి చేశారు. గ్రామల శివారుల్లో సీసీరోడ్లు పూర్తి చేశారు. అయితే చేసిన పనులకు సక్రమంగా బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేసినట్లు తెలిసింది. సుమారుగా పనులు నిలిపివేసి 8 నెలలు కావస్తుంది. ఈ రోడ్డు పూర్తయితే ఆయా గ్రామాల ప్రజల ఇబ్బందులు తొలుగుతాయి.

మరికొన్ని రోడ్లకు ప్రతిపాదనలు..

మండలంలో పలు లింక్ రోడ్లకు నిధులు మంజురై ఏడాది కావస్తున్నా నేటికీ పనులే ప్రారంభం కాలేదు. ఇక ఈ రోడ్లు ఇలా ఉండగానే మరికొన్ని రోడ్ల మరమ్మతులకు ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రతిప్రాదనలు చేశారు. చిలుకూరు నుంచి రామాపురం వరకు రోడ్ల మరమ్మతులకు రూ. 90 లక్షలు, చిలుకూరు నుంచి దూదియాతండా వరకు రూ.80 లక్షలు, బేతవోలు నుంచి ఆచార్యులగూడెం వరకు గల రోడ్డు మరమ్మతులకు రూ.1.30 కోట్లు, పాత కొండాపురం నుంచి కొత్త కొండాపురం వరకు రూ. 95 లక్షలు, కోదాడ నుంచి రామాపురం గ్రామం మీదుగా కొండాపురం వరకు రూ.1.30 కోట్లకు ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం నుంచి నిధులు ఇటీవలే మంజూరయ్యాయి. ఈ పనులకు సంబంధించి త్వరలో టెండర్లు కూడా పిలవనున్నారు.

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం



సీతారాంపురం మీదుగా నారాయణపురం వరకు బీటీ రోడ్డు రెన్యూవల్‌కు నిధులు మంజురయ్యాయని అధికారులు చెబుతున్నారు. కానీ నేటికీ పనులు ప్రారంభం కాలేదు. రోడ్డు మొత్తం గుంతలమయంగా మారడంతో ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వాహనాలు కూడా దెబ్బతింటున్నాయి. తక్షణమే పనులు ప్రారంభించి పూర్తిచేయాలి.

– గన్నా ప్రసాద్, సీతారాంపురం

పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం



కొండాపురం రోడ్డు పనులను త్వరలో తిరిగి ప్రారంభించేలా చూస్తాం. కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో సీతారాంపురం, ఆర్లెగూడెం రెన్యూవల్ బీటీ పనులు ఆగాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– పీఆర్ ఏఈ లక్ష్మారెడ్డి

క్లుప్తంగా

శోభకృత్ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



కోదాడఅర్బన్ : కోదాడ నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ శోభకృత నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం కోదాడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలుగు ప్రజల సంవత్సరాది ఉగాది పండుగను నియోజకవర్గ ప్రజలు ఆనందోత్సవాల మధ్య నిర్వహించుకోవాలని కోరారు. శోభకృత్ నామ సంవత్సరంలో రైతులు, ప్రజలు అన్ని రంగాలలో రాణించి, సుఖసంతోషాలతో జీవించాలని కోరారు. శోభకృత్ నామ సంవత్సరంలో తెలంగాణాతో పాటు భారతదేశం మరింత గొప్పగా అభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

సేవ్ జర్నలిజం డేను విజయవంతం చేయాలి

హుజూర్‌నగర్ : దేశవ్యాప్తంగా జర్నలిస్టుల సమస్యలపై ఈనెల 23న నిర్వహించనున్న సేవ్ జర్నలిజం డేను విజయవంతం చేయాలని టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు కోరారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐజేయూ ఆదేశాల మేరకు అన్ని డివిజన్ కేంద్రాలలో 23న నిర్వహించే ఆందోళనకు జర్నలిస్టులు తరలిరావాలన్నారు. ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా కె.సత్యనారాయణ మూడోసారి ఎన్నిక కావడంపై హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట స్థానిక విలేకరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం


నగదు అందజేస్తున్న ఆర్‌ఎంపీలు

చిలుకూరు : మండలంలోని ఆచార్యులగూడెం గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ వెంకటేశ్వర్లు సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. మంగళవారం చిలుకూరు మండల ఆర్‌ఎంపీల సంఘం ఆధ్వర్యంలో మృతుడి కుటుంబాన్ని పరామర్శించి, రూ. 20 వేల ఆర్థికసాయం అందజేశారు. ఆర్‌ఎంపీలు తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సహకార సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

చిలుకూరు : మండలంలోని మాధవగూడెం గ్రామంలో మంగళవారం మత్స్య సొసైటీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బుడిగ సైదాబాబు, ఉపాధ్యక్షుడిగా బుడిగ ఆదినారాయణ, కార్యదర్శి సతీష్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు కోదాడలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం నూతన కమిటీకి ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్య సొసైటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడు కవి సమ్మేళనం

కోదాడఅర్బన్ : ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని కోదాడలోని శ్రీగుంటి రఘునాథ స్వామి ఆలయంలో బుధవారం కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఆలయ అనువంశిక ధర్మకర్త, వ్యవస్థాపక చైర్మన్ గుడుగుంట్ల రంగయ్య మంగళవారం తెలిపారు. ఉగాది సందర్భంగా స్వామివారికి ఉదయం నుంచి అభిషేకాలు, పుష్పాలంకలరణ, మహానివేదన, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఉదయం 9గంటలకు కవి సమ్మేళనం, సాయంత్రం 5 గంటలకు పంచాంగశ్రవణం బ్రహ్మశ్రీ లక్ష్మీనారాయణశర్మ, సుశర్మ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ తుమ్మల వెంకట చలపతి, కవి సమ్మేళనం కన్వీనర్ ఎస్ఎస్‌రావు, పూజారి నల్లాన్ చక్రవర్తుల రాఘవాచార్యులు పాల్గొన్నారు.

దేశ శాంతికి సైకిల్ యాత్ర


సైకిల్ యాత్రికుడిని సన్మానిస్తున్న సేవా మండలి సభ్యులు

హుజూర్‌నగర్ : దేశం శాంతియుతంగా, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుతూ కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా సిందూరు పట్టణానికి చెందిన విజయ గోపాలకృష్ణ చేస్తున్న సైకిల్ యాత్ర మంగళవారం హుజూర్‌నగర్ చేరుకుంది. దీంతో సాయి సమాజ సేవా మండలి, సాయిబాబా మందిర కమిటీ సభ్యులు అతనికి స్వాగతం పలికి స్థానిక సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు చేయించి తీర్థ ప్రసాదాలు అందించారు. శాలువ, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ 2022 మార్చిలో ప్రారంభమైన ఈ సైకిల్ యాత్ర ఇప్పటివరకు 11 రాష్ట్రాలలో తిరిగి పట్టణానికి చేరుకుందని తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు టి.అంజయ్య, వి.నాగేశ్వరరావు, వి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అక్షర ఉగాది పురస్కారాలు ప్రదానం


కోదాడఅర్బన్ : అక్షర ఉగాది పురస్కారం అందుకుంటున్న కిట్స్ విద్యార్థిని పావని

కోదాడఅర్బన్ : కోదాడ కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఈసీఈ సెకండియర్ విద్యార్థిని కీసర పావని అక్షర ఉగాది పురస్కారాన్ని అందుకున్నట్లు కళాశాల చైర్మన్ నీలా సత్యనారాయణ మంగళవారం తెలిపారు. సూర్యాపేటలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ నృత్య కళాకారిణి విభాగంలో పావనికి అక్షర ఉగాది పురస్కారంలో భాగంగా మెమొంటో, ప్రశంసాపత్రాన్ని సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ అందచేసినట్లు తెలిపారు. ఉగాది పురస్కారం అందుకున్న విద్యార్థినిని మంగళవారం కళాశాలలో అభినందించారు. అలాగే పోతుగంటి నాగేశ్వరరావు, విజయ్‌కుమార్, నాగార్జునరావు, కృష్ణారావు, అధ్యాపకులు విద్యార్థినిని అభినందించారు.

డప్పు సతీష్‌కు పురస్కారం


గరిడేపల్లి : పురస్కారం అందుకుంటున్న సతీష్

గరిడేపల్లి : మండల కేంద్రానికి చెందిన డప్పు సతీష్‌కు ఉగాది పురస్కారం లభించింది. సోమవారం సూర్యాపేటలోని జీవీవీ గార్డెన్స్‌లో అక్షర ఫౌండేషన్ ఎస్‌జీటీఎస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పురస్కార ప్రదానోత్సవంలో సతీష్‌కు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా సతీష్ బృందాన్ని పలువురు అభినందించారు. కార్యక్రమంలో బృందం సభ్యులు అజిత, సుగుణ, లావణ్య, నాగలక్ష్మి, మార్త, అనిత, స్వరూప, నాగమణి, జ్యోతి, సుజాత, సంధ్య, అనురాధ, వెన్నల ఉన్నారు.

అటకెక్కిన పునర్విభజన చట్టం హామీలు


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్

హుజూర్‌నగర్ : రాష్ట్ర పునర్విభజన చట్టంలోని అంశాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 25 నుంచి సీపీఐ ఆధ్వర్యంలో ప్రజాపోరు యాత్ర ప్రారంభవుతుందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన ఆ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొమ్మిది ఏళ్ల నుంచి పునర్విభజన చట్టంలోని హామీలు అటకెక్కాయన్నారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ములుగు గిరిజన విశ్వవిద్యాలయం లాంటి హామీలు అమలుకు నోచుకోవడం లేదన్నారు. 12 రోజులు సాగే ప్రజా పోరు యాత్రలో సీపీఐ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఏప్రిల్ 14 నుంచి హుజూర్‌నగర్ నియోజకవర్గంలో జరిగే ఈయాత్రను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వై.రాములు, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు వి.సృజన, జిల్లా కార్యవర్గ సభ్యులు పి.బాబు, కె.శ్రీనివాస్, డి.ధనుంజయ నాయుడు, పి.వెంకటేశ్వర్లు, డి.మల్లీశ్వరి, వి.నారాయణరెడ్డి, నాయకులు జి.వెంకటేశ్వర్లు, డి.సత్యనారాయణ, ఎ.పున్నయ్య, రవి, రమేష్, కోటమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంధత్వ నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం


నడిగూడెం : తెల్లబెల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ జ్యోతి


మఠంపల్లి : యాతవాకిల్లలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ లక్ష్మీనరసింహరాజు

హుజూర్‌నగర్‌రూరల్ : తెలంగాణలో సంపూర్ణ అంధత్వ నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కరక్కాయలగూడెంలో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ కీత జయమ్మధనమూర్తితో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. గ్రామంలోని ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కంటి సమస్య ఉన్న వారికి అద్దాలు పంపిణీ చేసి, అపరేషన్ అవసరమైన వారిని రెఫర్ చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మచ్చ వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ చింతకుంట్ల కల్పన, కంటి వెలుగు క్యాంప్ సూపర్‌వైజర్ ఉదయగిరి శ్రీనివాస్, డాక్టర్ మంగ, కార్యదర్శి సతీష్, జయంతి, అశోక్, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

అంధత్వ నివారణకే 'కంటి వెలుగు'

మఠంపల్లి : ప్రజలలో అంధత్వ నివారణకే ప్రభుత్వం కంటి వెలుగు పథకాన్ని అమలు చేస్తుందని యాతవాకిల్ల సర్పంచ్ కె.లక్ష్మీనరసింహరాజు అన్నారు. మంగళవారం ఆయన స్థానిక గ్రామ పంచాయతి కార్యాలయంలో కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణంరాజు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు నాగయ్యయాదవ్, కుర్రి కాశయ్య, జ్యోతి, శ్రీదేవి, నాగయ్య, రమణ, లింగరాజు, సైదులు, పల్లె దవాఖాన వైద్యురాలు కళ్యాణి, డీఈఓ పూర్ణ, కార్యదర్శి నరేష్, వెంకన్న, ఏఎన్ఎం చంద్రకళ, రజిత, శిరీష, ఆశలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

నడిగూడెం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కంటి వెలుగు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ యాతాకుల జ్యోతి కోరారు. మంగళవారం మండల పరిధిలోని తెల్లబెల్లి గ్రామంలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని, ప్రభుత్వం ఇచ్చే మందులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బడేటి వెంకటేశ్వర్లు, సర్పంచ్ దేవబత్తిని వెంకటనర్సయ్య, వైద్యాధికారి డాక్టర్.అనిత, ఎంపీఓ ఎర్ర లింగారెడ్డి, పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి, బడేటి యేసు, కొల్లు వీరయ్య, భుజంగరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ : ప్రతిఒక్కరూ కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ జె.నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని 27వ వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వై.గురవయ్య, జె.శంభయ్య, గంగరాజు, నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, అమర్ గౌడ్, డాక్టర్లు సన, సృజన, హెచ్ఈఓ ప్రభాకర్, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

దొడ్డా నారాయణరావుకు పలువురి పరామర్శ

చిలుకూరు : చిలుకూరు గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ, స్వాతంత్ర్య సమరయోధుడు దొడ్డా నారాయణరావును మంగళవారం బీఆర్ఎస్ పార్టీ కోదాడ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ కె. శశిధర్ రెడ్డి, ఎంపీపీ బండ్ల ప్రశాంతి కోటయ్య, జెడ్పీటీసీ బొలిశెట్టి శిరీషానాగేంద్రబాబు పరామర్శించారు. నారాయణరావుతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మేకపోతుల శ్రీను, భిక్షం, లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు, మోహన్‌రావు, రామిరెడ్డి, వెంకన్న, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై విస్తృత అవగాహన కల్పించాలి


త్రిపురవరం పీహెచ్‌సీని పరిశీలిస్తున్న రాష్ట్ర నోడల్ అధికారి శ్రీహరి

అనంతగిరి : మహిళలకు ఆరోగ్యంపై వైద్య సిబ్బంది విస్తృతంగా అవగాహన కల్పించాలని వైద్యారోగ్య శాఖ రాష్ట్ర నోడల్ అధికారి శ్రీహరి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని త్రిపురవరం పీహెచ్‌సీలో మహిళా ఆరోగ్య పథకాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. మహిళలకు కావల్సిన అదనపు వసతుల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నట్లు పేర్కొన్నారు. మహిళలకు 57 రకాల పరీక్షలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రక్తహీనత, క్యాన్సర్, మధుమేహం, మూత్రాశయ ఇన్‌ఫెక్షన్, సంతాన సమస్యలకు ప్రత్యేక పరీక్షలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఆయన వెంట డా.లక్ష్మీప్రసన్న, కళావతి, విజయ్, మహేష్, శైలజ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలలకు సేంద్రియ కూరగాయలు అందజేత


సేంద్రియ ఆకుకూరలు అందజేస్తున్న శ్రీనివాస ఫౌండేషన్ సభ్యులు

మఠంపల్లి : మండలంలోని భీల్యానాయక్‌తండాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు, అంత్యాతండా ప్రాథమిక పాఠశాలకు మంగళవారం హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాస ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ సభ్యులు సేంద్రియ కూరగాయలు, ఆకుకూరలను ఎంఈఓ చత్రునాయక్, డీసీఓ క్రాంతికుమార్ ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు సీహెచ్ రాజేష్, ఎస్కు మస్తాన్, ఎంసీఓ నాగార్జున, గ్రామ పెద్దలు కోటానాయక్, మాన్‌సింగ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు కల్పించాలని వినతి

హుజూర్‌నగర్ : మున్సిపాలిటీలలోని పేదలకు ఉపాధి హామీ పనులు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.ధనుంజయనాయుడు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం హుజూర్‌నగర్ ఆర్డీఓ కార్యాలయంలో డీఏఓ కమలాకర్‌కు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి అనేకమంది తమ పిల్లల చదువుల నిమిత్తం పట్టణ ప్రాంతాలకు వలస వస్తున్నారని అలాంటి వారికి ఉపాధి హామీ పథకాన్ని వర్తింపజేయాలని కోరారు. ఇండ్లు లేని వారిని గుర్తించి వారందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గుండు వెంకటేశ్వర్లు, జడ వెంకన్న, యల్లావుల రమేష్, జక్కుల రమణ, జాల భద్రయ్య మంగయ్య పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనాలతో స్నేహపూర్వక వాతావరణం

- బీఆర్ఎస్ జిల్లా పరిశీలకుడు మెట్టు శ్రీనివాస్, ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

కోదాడ : క్షేత్రస్థాయిలో పార్టీని పటిష్టం చేయడానికి, నాయకులు కార్యకర్తల మధ్య స్నేహపూర్వక వాతావరణం కల్పించడానికి ఆత్మీయ సమ్మేళనాలు దోహదపడతాయని, వీటిని విజయవంతం చేయడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా పరిశీలకుడు మెట్టు శ్రీనివాస్, కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ కోరారు. మంగళవారం బీఆర్ఎస్ పార్టీ కోదాడ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం పట్టణంలోని గుడుగుంట్ల అప్పయ్య ఫంక్షన్‌హాల్‌లో ఎమ్మెల్యే అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికలు సమీస్తున్న సమయంలో కొంత మంది నాయకులు బూజు దులుపుకొని రోడ్ల మీదకు వస్తున్నారని వారిపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. నియోజకవర్గంలో 68 వేల మంది బీఆర్ఎస్ కుటుంబ సభ్యులున్నారని వారంత ఏకమై గొంతెత్తితే ప్రత్యర్థులు పరారవుతారన్నారు. పట్టణంలో రెండు, ఆరు మండలాల్లో ఆత్మీయ సమ్మేళనాలను నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ఎంపీపీలు చింత కవిత, యాతాకుల జ్యోతి, చుండూరు వెంకటేశ్వరరావు, యలక బిందు, జెడ్పీటీసీలు కృష్ణకుమారి, నల్లపాటి ప్రమీల, బాణాల కవిత, బుర్రా పుల్లారెడ్డి, సత్యబాబు, అల్తాఫ్ హుస్సేన్, సుంకర అజయ్‌కుమార్, బజ్జూరి వెంకటరెడ్డి, శివాజీనాయక్, చందు నాగేశ్వరరావు, గడ్డం సూర్యారెడ్డి, ఇర్ల రోజారమణి, పట్టణ కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అసమ్మతి నేతలు దుమ్మా..

బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశానికి కోదాడ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, రాష్ట్ర కార్యదర్శి ఏర్నేని బాబు, మున్సిపల్ చైర్ పర్సన్ శిరీష, డీసీసీబీ మాజీ చైర్మన్ పాండురంగారావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మహబూబ్‌జానీ, చిలుకూరు, మోతె ఎంపీపీలు, జెడ్పీటీసీలు, అనంతగిరి మండల జెడ్పీటీసీ హాజరు కాకపోవడం చర్చనీయాంశంగా మారింది.

మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి


కోదాడలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే బొల్లం, సెర్ప్ ఉద్యోగులు

కోదాడ : తెలంగాణ ప్రభుత్వం మహిళా సాధికారతకు ఎంతో కృషి చేస్తుందని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. సెర్ప్ ఉద్యోగులకు పేస్కేల్ వర్తింపజేస్తూ ప్రభుత్వం జీఓ నెం 11ను విడుదల చేయడాన్ని హర్షిస్తూ మంగళవారం కోదాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేసీఆర్ చిత్రపటానికి ఉద్యోగులతో కలిసి ఆయన పాలాభిషేకం చేశారు. 25 సంవత్సరాలుగా పేస్కేల్ కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగుల కల నెరవేరిందన్నారు. అనంతరం సెర్ప్ ఉద్యోగులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, సెర్ప్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీ

నడిగూడెం : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాలల్లో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలను మంగళవారం ఇంటర్మీడియట్ బోర్డు ఫ్లయింగ్ స్క్వాడ్ గుంటిపల్లి శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బందితో కలిసి ఆయా కేంద్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆయన వెంట పలువురు బోర్డు సిబ్బంది ఉన్నారు.


ఘనంగా పోషణ్ పక్వాడ


కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్, మహిళలు తదితరులు

చిలుకూరు : చిలుకూరు అంగన్‌వాడీ కేంద్రం– 4లో మంగళవారం పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గర్భిణి స్త్రీలు, బాలింతలు పోషక పదార్థాలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణులను పోషక పదార్థాలను అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రం టీచర్ సిరికొండ కవిత, అమృత, దీప్తి తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

నేరేడుచర్ల : మండలంలోని పెంచికల్‌దిన్న, మేడారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని పదవ తరగతి విద్యార్థులకు నారాయణ విద్యా సంస్థలు అందించిన స్టడీ మెటీరియల్‌ను మంగళవారం క్రాంతినికేతన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆ సంస్థ అధ్యక్షుడు సుంకర క్రాంతికుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకొని పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో పెంచికల్‌దిన్న పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రాఘవరెడ్డి, మేడారం పాఠశాల హెచ్‌ఎం పరమేశం తదితరులు పాల్గొన్నారు.


స్టడీమెటీరియల్ పంపిణీ చేస్తున్న క్రాంతికుమార్

జనచైతన్య యాత్రను జయప్రదం చేయాలి


చిలుకూరు : కొండాపురంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో ఈనెల 25న జరిగే జనచైతన్య యాత్రను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు డి.బ్రహ్మం కోరారు. మంగళవారం హుజూర్‌నగర్ పరిధిలోని అనుములగూడెం శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. రైతు సంఘం నాయకులు ఆర్.మురళి, శంభయ్య, వెంకన్న, భద్రయ్య, గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

హుజూర్‌నగర్‌రూరల్ : ఈ నెల 25న హుజూర్‌నగర్‌కు చేరుకోబోతున్న జన చైతన్య యాత్రను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి పోషణబోయిన హుస్సేన్ కోరారు. మంగళవారం మండలంలోని గోపాలపురంలో ఆ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ సభ్యులు సిద్దెల వెంకటయ్య, చందాల భిక్షం, చీకూరి తిరుపతయ్య, నాగేంద్రమ్మ, వెంకటేశ్వర్లు, సాయిలు, వెంకటరామయ్య –షేక్ సైదా రైతులు కార్మికులు పాల్గొన్నారు.

25న కోదాడకు యాత్ర

చిలుకూరు : ప్రజా సమస్యలపై సీపీఎం పార్టీ చేపట్టిన జనచైతన్య యాత్ర ఈ నెల 25వ తేదీన కోదాడకు చేరుకుంటుందని ఆ యాత్రలో పార్టీ నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు. మంగళవారం మండలంలోని కొండాపురంలో యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు వేనేపల్లి వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి నాగాటి రాములు, నాయకులు వీరస్వామి, బాషం లింగయ్య, సైదులు, సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

మేళ్లచెరువు : ఈనెల 25న హుజూర్‌నగర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో జరిగే జనచైతన్య యాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి వట్టెపు సైదులు కోరారు. మంగళవారం మండలంలోని యర్రగట్టుతండాలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో గుండు సైదులు, టి.స్వామి, శంకర్, సైదా, రాము, వెంకటేశ్వర్లు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

డక్కలి కులస్తులను ప్రభుత్వం ఆదుకోవాలి


కలెక్టరేట్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మునగాల : మండల కేంద్రంలో నివసిస్తున్న నిరుపేద డక్కలి కులానికి చెందిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా కన్వీనర్ కొత్తపల్లి శివకుమార్ కోరారు. కుల వివక్షకు గురవుతున్న డక్కలి కుటుంబాలతో కలిసి మంగళవారం కలెక్టరేట్‌లో ఏఓ శ్రీదేవికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో డక్కలి కులస్తులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని, లేదా ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని కోరారు. అదే విధంగా రేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా రామ్‌జీ, ఏసోబు, సావిత్రి, మంగమ్మ, రాణి, డక్కలి కులస్తులు పాల్గొన్నారు.

ఆలయంలో విశేష పూజలు

కోదాడఅర్బన్ : పట్టణంలో ఇటీవల ప్రతిష్ఠించిన అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే స్వామికి పంచామృతాలతో అభిషేకాలు, ఆకుపూజ, పుష్పాలంకరణ గావించారు. అనంతరం దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు అంజయ్య, అన్నదాన నిర్వాహకులు హనుమంతరావు, రామారావు, అన్నదాతలు బండారు నాగేశ్వరరావు, గీత, కళ్యాణి, సంధ్య పాల్గొన్నారు.